క్లుప్తంగా

చురుగ్గా జగనన్న కాలనీ రహదారి నిర్మాణం


వడలి చాకిరేవు పుంతలో జగనన్న కాలనీకి నిర్మిస్తున్న రహదారి

పెనుగొండ: వడలిలోని చాకిరేవు పుంతలోని జగనన్న కాలనీ రహదారి నిర్మాణం చురుగ్గాకొనసాగుతుంది. రహదారి ఇబ్బందులను గడ పగడపకూ మన ప్రభుత్వంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి లబ్ధిదారులు తీసుకు వెళ్లడంతో రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రూ.31.50 లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టారు. నాలుగు రోజులుగా షట్టు వేయడం పూర్తి కావడంతో మరో వారం రోజుల్లో రహదారి నిర్మాణం పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. రహదారి నిర్మాణాన్ని సర్పంచ్ కాసాని విజయ లక్ష్మీ పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తమరాని సత్యనారాయణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

పాఠశాలలకు చేరుతున్న విద్యా కానుక కిట్లు


మొగల్తూరులో పాఠశాలలకు పంపేందుకు సిద్ధం చేస్తున్న పుస్తకాలు

మొగల్తూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తొలిరోజే జగనన్న విద్యా కానుక అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్టాక్ పాయింట్ ఇన్చార్జ్, హెచ్ఎం వి.రవిశంకర సర్కార్ శనివారం తెలిపారు. మొగల్తూరు మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 68, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 10 ఉన్నాయి. గత విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతున్న విద్యార్థులతో పాటు కొత్తగా చేరే విద్యార్థులను అంచనావేసి సుమారు 5400 మంది విద్యార్థులకు జేవీకే కిట్లను సిద్ధం చేశామన్నారు. మొగల్తూరు మండలానికి సంబంధించి మొగల్తూరులో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారని, మండలంలోని ప్రతీ పాఠశాలలోని విద్యార్థులకు అందించేందుకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్ట్, బ్యాగ్, యూనిఫామ్‌లును ఆయా పాఠశాలకు చేరవేయడం దాదాపుగా పూర్తి చేశామన్నారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా కానుక పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయా పాఠశాలలో విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

కుళాయిల ద్వారా మురుగునీరు

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కుళాయిల నుంచి మురుగు నీరు వస్తోంది. 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి వదులుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

చెరువు పూడికతీత పనుల పరిశీలన

పోడూరు: పండితవిల్లూరు గ్రామంలో మల్లయ్య చెరువు పూడికతొలగింపు పనులు గత 15 రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. పనులను శనివారం గ్రామసర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీచంద్రిక మాట్లాడుతూ చాలాఏళ్ల తరువాత 5 ఎకరాల విస్తీర్ణం ఉన్న మల్లయ్యచెరువులో పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. సొసైటీ చైర్మన్ గెద్దాడ ఏకలవ్య, ఉపసర్పంచ్ సదమళ్ల వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.పద్మావతి, ఎన్ఆర్‌జీఈఎస్ టీఏ వి.సుదర్శనకుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సచివాలయాల్లో కంటి వెలుగు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని 11 సచివాలయాల్లో సోమవారం మూడో విడత కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి పరీక్షల నిర్వహణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కంటి వెలుగు డీపీఎంవో డాక్టర్ ఎస్.చందనప్రియాంక తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన అవ్వాతాతాలకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు,మందులు అందించడంతోపాటు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తారన్నారు. ఈక్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సోమవారం ఆకివీడు మండలం అయిభీమవరం సచివాలయం, పోడూరు మండలం వద్దిపర్రు సచివాలయం, ఇరగవరంలోని రేలంగి 4 బొప్పరాజు పాలెం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటిలోని వాకర్స్ కాలనీ, మొగల్తూరు మండలం మొగల్తూరు 2 సచివాలయం, తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు సచివాలయం, పాలకొల్లు మున్సిపాలిటి వీవర్స్ కాలనీ, పెనుమంట్ర మండలం పోలమూరు 1 సచివాలయం, గణపవరం మండలం పిప్పర 2 సచివాలయం, తణుకులోని వేల్పూరు 3 సచివాలయంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

గ్రామాల్లో ఉపాధి పనుల జోరు


కాపవరంలో చెరువు తవ్వుతున్న ఉపాధి కూలీలు


నగంచెరువులో పంటబోదెలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

- అమృత సరోవర్‌లో చెరువుల తవ్వకాలు
- రూ.250 కూలీ గిట్టుబాటు

ఉపాధి పనులు ఇలా

మండలం	మంజూరైన పనులు	అంచనా వ్యయం పూర్తయిన	పని దినాలు	చెల్లించిన సొమ్ము
పాలకొల్లు	235	రూ.6.57 కోట్లు	66,703	రూ.1.66 కోట్లు
పోడూరు	860	రూ.5.60 కోట్లు	89,000	రూ.2.22 కోట్లు

పాలకొల్లు అర్బన్: గ్రామాల్లో ఉపాధి పనులు జోరందుకున్నాయి. దీంతో కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు నెలల్లోనే కొంతమంది కూలీలకు 30 రోజుల నుంచి 40 రోజుల పని లభించింది. అలాగే భార్యాభర్తలు ఇద్దరు కలిసి 50 రోజులకు పైగా ఉపాధి పనులు చేసుకున్నారు. అలాగే ఉపాధి కూలీ రోజుకి రూ.250 వరకూ వస్తుంది. అయితే అధిక ఎండలు కూలీలను ఇబ్బందిపెడుతున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు ఉదయం 10 గంటలకు అలసిపోతున్నారు. ప్రధానంగా పంటబోదెలు పూడిక తీయడం, మురుగు డ్రెయిన్‌లు, పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు, అమృత సరోవర్‌లో మంచినీటి చెరువుల తవ్వకం తదితర పనులు ఉపాధి కూలీలు చేపడుతున్నారు.

చెరువుల తవ్వకంతో పెరిగిన పని దినాలు

ఈ ఏడాది పాలకొల్లు మండలంలోని కొత్తపేట, కాపవరం, వెంకటాపురం గ్రామాల్లో అమృత సరోవర్ నిధులతో మంచినీటి చెరువుల తవ్వకం పనులు చేపట్టారు. కాపవరంలో రూ.3.60 లక్షలతో రెండు చెరువులు తవ్వాలు, అలాగే కొత్తపేటలో రూ.7.90 లక్షలతో రెండు చెరువులు తవ్వారు. అలాగే వెంకటాపురంలో రూ.30 వేలతో మంచినీటి చెరువు మరమ్మతులు చేశారు.

ఈ ఏడాది 40 రోజులు పనిచేసుకున్నా



గడచిన మూడు నెలల్లో 40 రోజులు ఉపాధి పనులు చేసుకున్నా. కూలీ రూ.250 వరకు గిట్టింది. ఈ ఏడాదిలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకుంటా. పనులు లేని సమయంలో ఉపాధి పనులు నాకు, నా కుటుంబానికి ఉపాధి కల్పించాయి.
– పెండ్ర వెంకటలక్ష్మి, ఉపాధి కూలి, కాపవరం

అదనపు పనిదినాలు లభించాయి



మా గ్రామంలో ఈ ఏడాది అమృత సరోవర్‌లో చెరువు తవ్వకం పనులు మంజూరయ్యాయి. దీంతో అదనపు పని దినాలు లభించాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 48 రోజులు పని చేసుకున్నా.
– చొప్పల కాలిదాసు, ఉపాధి కూలి, కాపవరం

నేడు చీఫ్ విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదివారం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటారు. నియోజకవర్గంలో జరిగే పలు శుభకార్యాల్లో పాల్గొంటారని, సాయంత్రం 4 గంటల నుంచి కార్యాలయంలో అందుబాటులో ఉంటారని శనివారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వెలవరించిన ప్రకటనలో పేర్కొన్నారు.

వశిష్ట ఘాట్ రోడ్డు అధ్వానం


మట్టి దిబ్బలతో దర్శనమిస్తున్నవశిష్ట ఘాట్‌రోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి రోడ్డు అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా గోదావరిబండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్డు ఓ విధంగా ఉపయోగం లేకుండా పోయాయి. రోడ్డు పక్కన మట్టి దిబ్బలు దర్శినమిస్తున్నాయి. రోడ్డు వెంబడి ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ ఏటిపార, ఇంజేటివారిపేటలో శనివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి వాణి ట్రస్టు అందించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో శ్రీకుంతీ మహేశ్వరి గొంతేలమ్మ, నంది విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పాలపర్తి శ్రీను,విజయమణి, ఇంజేటి సోమేశ్వరరావు, ఆదిలక్ష్మి,పాలపర్తి నాగరాజు, కనకమహాలక్ష్మి దంపతులతో కోసూరి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విగ్రహప్రతిష్ఠాపన చేయించారు. అనంతరం వీరబ్రహ్మం సిద్ధాంతి ఆర్థిక సహాయంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరుపాలెం వెంకన్న, ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ సంఘ చాలక్ మంతెన రామచంద్రరాజు, నాయకులు నక్కా రామోజీ, మన్నే కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొంతేరులో అన్నసమారాధన

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాన కమిటీ, గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఈ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అన్నసమారాధనతో ఈ ఏడాది వార్షిక కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆయన వివరించారు. కొంతేరు పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలి


సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ముదునూరి తన కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చే బాధ్యత తనదన్నారు. కాలువలు వదిలిన దృష్ట్యా మంచినీటి చెరువులను యుద్ధప్రాతిపదికన నింపుకోవాలన్నారు. వర్షాకాలంలో శుభ్రమైన మంచినీరు ప్రతి గ్రామానికి అందాలని సూచించారు. అవసరమైన చోట్ల ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు చేయాలని చెప్పారు. క్లోరినేషన్ సవ్యంగా చేసి, పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని చెప్పారు. మంచినటీ సరఫరాలో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలన్నారు. అలాగే రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన అభివృద్ధి పనులు ప్రారంభానికి చర్యలు చేపట్టాలన్నారు. నాడు-నేడు పనులకు సంబంధించి పాఠశాలల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

ఓఆర్ఎస్ ద్రావణంపై ప్రజలకు అవగాహన

పోడూరు: పెనుమదం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఓఆర్ఎస్ ద్రావణంపై గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, స్థానిక ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎన్ఎం పి.సుబ్బాయమ్మ మాట్లాడుతూ వాంతులు, విరోచనాలు అయిన ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని, విరోచనాలు అయిన 3 రోజుల నుండి జింక్ ట్యాబ్లెట్స్ 14 రోజుల పాటు వాడాలని తల్లులకు సూచించారు. గర్భిణులు, వృద్ధులు ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వల్ల నీరసం తగ్గుతుందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని పలువురు గర్భిణీలకు దాతల సహకారంతో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె.ప్రభావతి, ఆశా కార్యకర్తలు పి.సాయిలక్ష్మి, పి.లక్ష్మీదుర్గ, బి.పెద్దిలక్ష్మి, కె.సంధ్య, కంజులూరి రామకృష్ణ, వనచర్ల రాంబాబు, కడలి ప్రసాద్, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ భాస్కర్

పెనుగొండ: రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించే విధంగా జాగ్రత్తలు వహించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును జిల్లా ఆర్ అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసారు. నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణాలు పూర్తి కావచ్చాయన్నారు. మార్టేరు రామేశ్వరం రహదారి విస్తరణ పూర్తయ్యిందన్నారు. పెనుగొండ మార్టేరు రహదారి నిర్మాణం పూర్తి చేశామన్నారు. పెనుగొండ ములపర్రు విస్తరణ, ఆచంట సిద్ధాంతం రహదారి నిర్మాణం రూ.17 కోట్లతో చేపట్టామన్నారు. గ్రామాల్లో సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేశామని, బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో రహదారుల నిర్మాణంలో నాణ్యత లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యంగా పెనుగొండ మార్టేరు రహదారి, సిద్ధాంతం లింక్ రోడ్డులు మరీ దారుణంగా ఉండేవన్నారు. ఇప్పుడు నిర్మాణంలో నాణ్యత పాటించడంతో ఇబ్బందులు తప్పాయన్నారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, ఆచంట సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పార్టీ నాయకులు కొవ్వూరి చిన్న, మేడిచర్ల పండు, మైలే ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


గవరపేటలో నూతనంగా నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల లో ఓల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం గవరపేటలో నూతనంగా నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలోని పలు సమస్యలను శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని ఆర్చ్ నుంచి ఆంజనేయస్వామి గుడి వరకూ మెయిన్ రోడ్డు విస్తరణ చేయాలని, దీనికి బాక్స్ కల్వర్టు నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొలిమేర వెంకటేశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బీశెట్టి నరసింహరావు (బాబ్జి), పార్టీ నాయకులు మళ్ల జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన


అడవిపాలెంలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలో పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న పల్లపు వీధి కల్వర్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, గంజి నరసింహారావు, సిర్రా నాగరాజులు పరిశీలించారు. పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని పల్లపు వీధి సుమారు నాలుగు అడుగులు పల్లంగా ఉంటుంది. కనుకనే ఈ వీధికి పల్లపు వీధి అనే పేరు వచ్చింది. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డు పిల్ల కాలువ తలపిస్తుంది. ఆ సమయంలో ఈ వీధిలో నివసించే సుమారు 20 కుటుంబాల వారు అడుగు తీసి బయటపెట్టలేని దుస్థితి నెలకొంటుంది. దశాబ్దాలు కాలంగా ఈ దుస్థితిని ఎవరూ తొలగించలేదు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు స్థానికులు తమ గోడు వెలబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఈ రోడ్డు ప్రారంభంలో మురుగుబోదె ఉంది. ప్రస్తుతం ఆ బోది వద్ద పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే పల్లపువీధి ప్రజలకు రోడ్డు సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

చిన్నారి వైద్యానికి వాకర్స్ క్లబ్ ఆర్థిక సహాయం


చిన్నారి తల్లికి నగదు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

సాక్షి ఎఫెక్ట్

పాలకొల్లు సెంట్రల్: చిన్నారి వైద్యానికి దాతలు ముందుకు వస్తున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ 25వ వార్డుకు చెందిన జక్కంపూడి వెంకటేష్, దేవి దంపతుల మూడు నెలల కుమార్తె క్రానియోసినోస్టోసిస్ వ్యాధితో బాధపడుతున్న విషయం సాక్షి కథనం ద్వారా తెలుసుకున్న దాతలు ఒక్కొక్కరిగా ముందుకు వస్తున్నారు. శనివారం వాకర్స్ క్లబ్ సభ్యులు పాప తల్లిదండ్రులకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం చిన్నారికి చికిత్స చేస్తామని చెప్పిన కాకినాడ వైద్యులు శనివారం : డ్ చేసి హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించినట్లు పాప తండ్రి వెంకటేష్ తెలిపారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ మానెం బసవరాజు, సెక్రటరీ పీర్‌సాహెబ్, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, ఎస్ రామచంద్రరావు, ధనాల శ్రీరామమూర్తి, తులా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు సమయాన్ని వినియోగించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

నరసాపురం: విద్యార్థులు ఖాళీగా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. నరసాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో శనివారం రాత్రి స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా పుస్తక పఠనం, ఆటలు, యోగా వంటి అంశాల్లో శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకెళ్లాలని చెప్పారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ ఈ సంవత్సరం నిర్వహించిన శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పెద్ద సంఖ్యలో పిల్లలు తర్ఫీదు పొందారని చెప్పారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆర్.సుబ్బారావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం


ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గృహనిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు

యలమంచిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు కోరారు. హౌసింగ్ డే సందర్భంగా మేడపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీల్లో స్థలపూడిక జరిగి రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. లబ్ధిదారులకు ఇల్లు త్వరగా నిర్మించుకుంటే బిల్లులు కూడా త్వరగా మంజూరు చేస్తామని త్రిమూర్తులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, వైఎస్సార్ సీపీ నాయకులు డేగల వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ రాజారామ్, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాంతారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్ తదితరులు ఉన్నారు.